తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

30 ఏళ్ల ప్రస్థానం వార్షికోత్సవం 1996 - 2026


# ఫ్లెక్సీ కడుతూ...విద్యుత్‌షాక్ గురై యువకులు మృతి

## యువకుల కుటుంబాల్లో విషాదం




పుత్తూరురూరల్, ఆగస్టు 14 ప్రభాతవార్త: పుత్తూరు పట్టణంలోని ఎస్‌బీఐ కాలనీకి చెందిన చిరంజీవి కుమారుడు గోకుల్(18), కల్యాణపురంకు చెందిన గిరికుమార్ విగ్నేష్(19), స్నేహితులు, ఇద్దరు ఒ ప్రైవేటు డిగ్రీ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు. ఫ్లెక్సీ కడుతూ విద్యుత్‌షాక్ గురై ఇద్దరి యువకులు మృతి చెందిన సంఘటన పుత్తూరు పట్టణంలో శుక్రవారం మధ్యాహ్నం జరిగింది. స్థానికుల కథనం మేరకు... పుత్తూరులో శ్రీ ద్రౌపదీదేవి సమేత ధర్మరాజుల తిరుణాల సందర్భంగా శుక్రవారం రోడ్డులో ఫ్లెక్సీ కట్టేందుకు ఒ భవనం పైకి వెళ్లారు. ఫ్లెక్సీ కట్టే సమయంలో జారి 11కేవీ విద్యుత్ తీగలపై పడింది. దీంతో విద్యుత్‌షాక్ గురై ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందారు. మృతి చెందిన గోకుల్ తండ్రి బీఎస్‌ఎఫ్‌లో పని చేస్తున్నాడు. అలాగే మృతి చెందిన విగ్నేష్ తండ్రి ఆటో డ్రైవర్‌గా పని చేస్తూ జీవనం సాగిస్తున్నారు. దీంతో ఇరు కుటుంబాలను విషాదం నెలకొంది. సంఘటన విషయం తెలిసిన వెంటనే డీఎస్పీ రవికుమార్, సీఐ నెట్టి కంటయ్య, ఎస్ఐ నాగేంద్రబాబు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలను ఆరా తీశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను పుత్తూరు ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పుత్తూరు పోలీసులు తెలియజేశారు.

# గంజాయి అక్రమ రవాణా

- 18 కిలోలు గంజాయి స్వాధీనం - 9 మంది అరెస్ట్
- వెస్ట్ పోలీస్ పరిధిలో నలుగురు అరెస్ట్ - 13 కిలోల గంజాయి స్వాధీనం
- తిరుచానూరు పోలీసులు పరిధిలో ఐదు మంది అరెస్ట్ 5కేజీ గంజాయి స్వాధీనం



స్వాధీనం చేసుకొన్న గంజాయి

తిరుపతి క్రైం, ఆగస్టు 14 ప్రభాతవార్త: తిరుపతి ఎస్పీ ఆదేశాలతో పక్కా సమాచారంతో తిరుచానూరు పోలీసులు మరియు వెస్ట్ పోలీసులు రెండు వేరు వేరు సోదాలలో పెద్ద ఎత్తున గంజాయి స్వాధీనం చేసుకొని నిందితులను అరెస్టు చేశారు. ఎస్పీ కార్యాలయం సమాచారం మేరకు తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బారాయుడు ఆదేశాలతో ప్రత్యేకంగా చేపట్టిన గంజాయి సోదాలో భాగంగా 18 కిలోల గంజాయి స్వాధీనం చేసుకోగా 9 మంది నిందితులను అరెస్టు చేశారు. ఇందులో తిరుచానూరు పోలీసులు ఐదు కిలోల గంజాయి స్వాధీనం చేసుకుని ఐదు మంది నిందితుల అరెస్టు కాగా వెస్ట్ పోలీసులు 13 కిలోల గంజాయి స్వాధీనం చేసుకుని నలుగురు నిందితులను అరెస్టు చేశారు. ప్రధాన నిందితుడైన అరుగొండం సోమశేఖర్ శ్రీకాళహస్తి ప్రాంతం నుంచి గంజాయి తీసుకువచ్చి తిరుపతి, రేణిగుంట పరిసరాల్లో విక్రయిస్తున్నట్లు దర్యాప్తులో వెల్లడైంది. ఈ కేసులో అరుగొండం సోమశేఖర్, అక్కల రథసారధి, షేక్ ఫైరోజ్, ఫైరు, పన్నూరు లీలాక్రిష్ణ, గురివింటి చరణ్ తేజ్లను అరెస్ట్ చేశారు.

**వెస్ట్ పోలీసులు - 13 కిలోల గంజాయి స్వాధీనం:**
వెస్ట్ పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రత్యేక నిఘాలో భాగంగా శుక్రవారం 8 గంటలకు మెటర్నటీ హాస్పిటల్ రోడ్డు, రాజన్న పార్కు వెనుక ప్రాంతంలో నలుగురిని పోలీసులు అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి 13 కిలోల డ్రై గంజాయి, 4 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో కొండామ్రి జగదీష్, గొడ్ల పార్థసారథి అలియాస్ పార్థ, షేక్ ఇర్ఫాన్, బడి పోలయ్యలను అరెస్ట్ చేశారు.

## గ్రామీణ వ్యాపారులకు...

# తోడుగా ట్రేడ్ లైసెన్స్

-వ్యాపారానికి రక్ష, రుణాలకు దారి
-జిల్లా పంచాయతీ అధికారి సుశీల దేవి




ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న జిల్లా పంచాయతీ అధికారి

తిరుపతి కలెక్టరేట్, ఆగస్టు 14 ప్రభాతవార్త : జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ ఆధ్వర్యంలో శుక్రవారం తిరుపతి కలెక్టరేట్లో జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల న్నిటిలోనూ వ్యాపారం నిర్వహిస్తున్న వారందరికీ గ్రామపంచాయతీల ద్వారా డిజిటల్ ట్రేడ్ లైసెన్స్ జారికి చర్యలు చేపట్టినట్టు జిల్లా పంచాయతీ అధికారి సుశీల దేవి తెలియజేశారు. గ్రామ పంచాయతీల నుండి ఎటువంటి ముందస్తు అనుమతి లేకుండా గ్రామీణ ప్రాంతాల్లో వివిధ రకాల వ్యాపారాలు నిర్వహిస్తున్న వారిని గుర్తించి స్వర్ణ పంచాయతీ పోర్టల్ ద్వారా డిజిటల్ ట్రేడ్ లైసెన్స్ సర్టిఫికెట్ స్యాచురేషన్ పద్ధతిలో మంజూరు చేయుటకు ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్‌శాఖ చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ప్రాథమికంగా చంద్రగిరి మండలంలోని మిట్టపాలెం, ఎ రంగంపేట గ్రామ పంచాయ తీలలో అన్ని రకాల వ్యాపారస్తులను గుర్తించి వారికి డిజిటల్ ట్రేడ్ లైసెన్స్ సర్టిఫికెట్ల ఆవశ్యకత పై అవగాహన మరియు సర్టిఫికేట్లను అందించే కార్యక్రమం కందులవారి పల్లె పంచాయతీలోని మీటింగ్ హాలు నందు జరిగింది. ఈ కార్యక్రమంలో మిట్టపాలెం, ఎ రంగంపేట గ్రామపంచాయతీ లోని ప్రాంతాలలో కిరాణా దుకాణాలు, రైస్/ఆయిల్ మిల్లులు, టీ స్టాళ్లు, చిన్న హోటళ్లు, వెల్డింగ్/ఫ్యాబ్రికేషన్ వర్క్‌షాప్‌లు, పెట్రోల్ బంకులు, గ్యాస్ ఏజెన్సీలు, టైలరింగ్ షాపులు, సెలూన్లు మొ++ అన్ని రకాల వ్యాపారస్తులు పాల్గొన్నారు. ట్రేడ్ లైసెన్స్ వ్యాపారవేత్తలకు ఒక నిర్దిష్ట ప్రదేశంలో నిర్దిష్ట వ్యాపార కార్యకలాపాన్ని నిర్వహించడానికి గ్రామ పంచాయతీ జారీ చేసే చట్టపరమైన అనుమతి పత్రం. ఈ పత్రం పొందడం ద్వారా ఆరోగ్యం, భద్రత, పరిశుభ్రత సంబంధిత స్థానిక నిబంధనలను వ్యాపారులు పాటిస్తారని నిర్ధారిస్తుంది అలానే నిర్దిష్ట స్థలం ఆరకమైన వ్యాపార కార్యకలాపానికి అనుమతించబడిందని ధృవీకరిస్తుంది. వ్యాపారాన్ని వ్యవస్థీకరించడానికి అవసరమైన వ్యాపార బ్యాంకు ఖాతా, జీఎస్టి నమోదు, ఎఫ్‌ఎస్‌ఎఐ లైసెన్స్ (ఆహార వ్యాపారాలకు), రుణాల కోసం దరఖాస్తు చేయడం, ప్రభుత్వ పథకాల సబ్సిడీలు వంటి వాటికి ట్రేడ్ లైసెన్స్ ముందస్తు అవసరం అని జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ రవికుమార్ తెలియ చేశారు. వ్యాపార మెళుకువలు, బ్రాండింగ్, ఆన్లైన్ నమ్మకాలు వంటి వాటిపై అవగాహన కలిగించి ఆసక్తి కనిపించిన వారందరికీ చంద్రగిరిలోని యూనియన్ బ్యాంక్ వారి స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ద్వారా శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తామని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి లోకనాథం తెలియజేశారు. డిఆర్డిఏ ప్రతినిధి గంగయ్య మాట్లాడుతూ రుణ అవకాశాలు మరియు వ్యాపార అవకాశాలను వివరించారు. డిఎల్పిఓ సురేష్ నాయుడు మాట్లాడుతూ వ్యాపారస్తులు గ్రామపంచాయతీలు వద్ద నుండి డిజిటల్ లైసెన్స్ సర్టిఫికెట్ పొందే విధానాన్ని మరియు లైసెన్స్ ఫీజ్ కట్టడానికి గల ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమానికి హాజరైన చిరు, మధ్య తరగతి వ్యాపారస్తులందరూ మునిపటిలా ట్రేడ్ లైసెన్సులకు రసీదు కాకుండా డిజిటల్ సర్టిఫికెట్ను ఇవ్వడం ద్వారా తమ వ్యాపార సముదాయాలలో ప్రదర్శించడానికి మరియు కస్టమర్ల నమ్మకాన్ని గెలుచుకోవడానికి చాలా తోడ్పాటు లభిస్తుందని హర్షం వ్యక్తం చేస్తూ, స్వర్ణ పంచాయతీ పోర్టల్ ద్వారా ఈ అవకాశాన్ని కల్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకి, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కి, పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణ తేజకి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ కమిషనర్ కార్యాలయపు సహాయ సంచాలకులు చందన, సాయి లహరి, చంద్రగిరి ఎం.పి.డి.వో దేవిక, మండలంలోని పంచాయతీ అభివృద్ధి అధికారులు మరియు స్థానిక వ్యాపారస్తులు పాల్గొన్నారు.

## కన్న తండ్రిని ...

# హత్య చేసిన కుమారుడు

- మద్యం మత్తులో ఫోన్‌లో దూషించుకున్న తండ్రి, కొడుకులు
- ఎస్‌ఆర్ పురం మండలం క్షీరసముద్రంలో ఘటన




హత్యకు గురైన ఆనంద్-కత్తి దాడిలో గాయపడిన అత్త గీత

శ్రీరంగరాజపురం, ఆగస్టు 14 ప్రభాతవార్త: మద్యం మత్తులో సొంత తండ్రినే సొంత కుమారుడు దారుణంగా హత్య చేసిన సంఘటన ఎస్‌ఆర్ పురం మండలం క్షీరసముద్రం గ్రామంలో చోటు చేసుకుంది. గత కొంతకాలంలో తండ్రి, కుమారుడు ఇద్దరు మద్యం సేవించి ఫోన్‌లో ఘర్షణ పడేవారు. ఈ క్రమంలో గురువారం రాత్రి ఫోన్‌లో ఇద్దరి మధ్య తీవ్ర వాగ్వివాదాలు జరుగడంతో నీ అంతు తేల్చుతా అంటూ రాత్రికి రాత్రి క్షీరసముద్రం చేరుకున్న కుమారుడు తండ్రి కోసం కాపుకాసి హత్య చేయడంతో సంచలనం కలిగింది. ఎస్‌ఆర్ పురం మండలం క్షీరసముద్రం గ్రామంకు చెందిన ఆనంద్, జగదీష్‌లు తండ్రి కుమారులు. ఆనంద్‌కు స్వల్ప వికలాంగత్వం వుంది. ఆనంద్‌కు గత ఇరవై సంవత్సరాల క్రితం అరగొండ గ్రామంకు చెందిన మీనాతో వివాహం జరిగింది. కొంతకాలం పాటు ఆనంద్, మీనాల కాపురం సాఫీగా జరుగగా ఆపై గొడవలు ప్రారంభం అయ్యాయి. ఈ క్రమంలో మీనా భర్త ఆనంద్‌ను వదలి పిల్లలను తీసుకుని చిత్తూరుకు వెళ్ళి అక్కడే స్థిరపడింది. మీనా చిత్తూరులో తన ఇద్దరు కుమారులతో వుండి వారిని ఇంటర్మీడియేట్ వరకు చదివించింది. పెద్ద కుమారుడు జగదీష్‌కు షిఫ్ట్ ఆపరేటర్‌గా పని లభించడంతో అతను సైతం మద్యంకు బానిస అయ్యాడు. తండ్రి, కుమారుడు ఇద్దరు తరచు మద్యం సేవించి ఫోన్‌లో గొడవ పడేవారు. ఇది సర్వసాధారణం అయ్యింది. ఈ క్రమంలో గురువారం సైతం తండ్రి ఆనంద్, కుమారుడు జగదీష్‌లు మద్యం సేవించి ఫోన్‌లో ఘర్షణ పడ్డారు. తండ్రి ఆనంద్ తన భార్య మీనాను ఫోన్‌లో దూషించడంతో కుమారుడు జగదీష్‌కు ఆగ్రహం తెప్పించింది. తన తల్లిని దూషిస్తే అంతు చూస్తానని ఫోన్‌లోనే తండ్రి ఆనంద్‌ను జగదీష్ హెచ్చరించాడు. అయితే నేను పుట్టించిన వాడిని నన్నేం చేస్తావురా! అంటూ తండ్రి ఆనంద్ చెప్పడంతో నేను వచ్చి నీ కథ ముగిస్తాను అంటూ కుమారుడు జగదీష్ చిత్తూరు నుండి ఎస్‌ఆర్ పురంకు బయలుదేరాడు. గురువారం రాత్రి 10 గంటల సమయంలో ఎస్‌ఆర్ పురం మండలం క్షీరసముద్రం గ్రామంకు చేరుకున్న జగదీష్ తండ్రి కోసం వెతికాడు. అయితే తండ్రి కన్పించకపోవడంతో అతని కోసం ఎదురు చూడటం ప్రారంభించాడు. ఈ పరిస్థితుల్లో తండ్రి జగదీష్ రాత్రి 11 గంటల సమయంలో ఇంట్లో వున్నాడని తెలుసుకున్న కుమారుడు జగదీష్ ఇంటికి వెళ్ళి తండ్రి ఆనంద్‌పై కత్తితో దాడి చేశాడు. జగదీష్ కత్తి తీసుకుని తండ్రి ఆనంద్ శరీరంపై తొమ్మిదికి పైగా గాట్లు వేయడంతో అతనికి తీవ్ర రక్తస్రావం జరిగి తీవ్ర గాయాలు అయ్యాయి. తండ్రి అరచిన అరుపులకు ప్రక్కనే వున్న జగదీష్ అత్త గీత అక్కడికి చేరుకుని జగదీష్‌ను అడ్డుకోవడానికి ప్రయత్నించింది. అయితే జగదీష్ తన అత్త గీతను సైతం కత్తిలో పొడవటంతో ఆమెకు గాయాలు అయ్యాయి. ఆనంద్ అరచిన అరుపులకు అక్కడికి చేరుకున్న స్థానికలు తీవ్రంగా గాయపడిన ఆనంద్‌ను చికిత్స నిమిత్తం 108 వాహనంకు సమాచారం ఇచ్చి ఆ వాహనంలో ఆనంద్‌ను చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే ఆనంద్‌కు తీవ్ర గాయాలు కావడంతో అతను మృతి చెందాడు. ఈ మేరకు స్థానికుల సమాచారం మేరకు సంఘటనా స్థలం చేరుకున్న పోలీసులు నిందితుడు జగదీష్‌ను అరెస్టు చేసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# తగిన సమయంలో మరింత గుర్తింపు

-యువనేత శ్రీధర్‌వర్మకు ఎస్వీబిసి చైర్మన్ పగ్గాలు



టిటిడి చైర్మన్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన శ్రీధర్‌వర్మ

తిరుమల, ఆగస్టు 14 ప్రభాతవార్త ప్రతినిధి: తిరుమలకు చెందిన ఎన్టీఆర్ అభిమాని ఎన్టీఆర్‌రాజు కుమారుడు బి.శ్రీధర్‌వర్మకు అరుదైన గుర్తింపు లభించింది. కూటమి ప్రభుత్వం సిఎం చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేశ్ ఆశీస్సులతో టిటిడి ఎస్వీబిసి చైర్మన్ పదవి దక్కింది. శుక్రవారం టిటిడి ఈఓ ముద్దాడ రవిచంద్ర నుండి నియామక ఉత్తర్వులు అందుకున్నారు. టిడిపి రాష్ట్ర మీడియా కో ఆర్డినేటర్‌గా వ్యవహరిస్తున్న శ్రీధర్ వర్మను ఎస్వీబిసి చైర్మన్‌గా నియమించడం పట్ల పార్టీ నేతలు, వర్గాలు హర్షం వ్యక్తం చేశాయి. శ్రీధర్ వర్మ కుటుంబానికి టిడిపితో, ఎన్టీఆర్ కుటుంబంతో దశాబ్దాల అనుబంధం ఉంది. తిరుపతి టిడిపిలో కీలకంగా పనిచేసిన ఎన్టీయార్ రాజు గతంలో టిటిడి పాలక మండలి సభ్యుడిగా పనిచేశారు. ఈనెల 22వ తేదీన వర్మ ఎస్వీబీసీ చైర్మన్‌గా పదవీ బాధ్యతలు చేపట్టనున్నారు. అనంతరం ఆయన టిటిడి చైర్మన్ బిఆర్ నాయుడును మర్యాదపూర్వకంగా కలిశారు.

## యాదవులపై...

# దాడి సిగ్గుచేటు

- ఇంకా ఎన్నాళ్లు కుల రాజకీయాలు చేస్తారు?
- యాదవ కార్పొరేషన్ చైర్మన్ గొల్ల నరసింహా యాదవ్




తిరుపతి హెల్త్, ఆగస్టు 14 ప్రభాతవార్త: పులివెందుల ఎమ్మెల్యే వైయస్ జగన్మోహన్‌రెడ్డి కర్నూలు ఆదోనిలో జరిగిన సంఘటన ఆయన ప్రదర్శించిన తీరు యావత్ ప్రజానీకం సిగ్గుతో తలదించుకునే విధంగా ఉన్నదని, యాదవ కులం ఇంటిపై దాడి చేసి ఇల్లు, గేటు, దాలమందిరం ధ్వంసం చేసిన ఘటన గ్రామ ప్రజలందరూ ముక్తకంఠంతో ఖండించడం జరిగిందని యాదవ కార్పొరేషన్ చైర్మన్ గొల్ల నరసింహ యాదవ్ అన్నారు. శుక్రవారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఎస్సీ మహిళను ఏ విధంగా అవమానించారో ప్రజలందరికి తెలుసన్నారు. ఎవరైతే నేరస్తులు ఉన్నారో శాసనసభ్యులు విరుపాక్షిని పరామర్శ పేరుతో ప్రజలందరూ విస్తుపోయే విధంగా ఐదారు గంటలసేపు ర్యాలీ నిర్వహించడం దేనికి సంకేతం అన్నారు. యాదవల్ని నడిరోడ్డుపై గొంతు కోసి ఎలా సంపారో తెలుసన్నారు. అవినీతి ఆరోపణలు ఎదుర్కొం టున్న విరుపాక్షిని పార్టీ నుండి బహిష్కరించాల్సింది పోయి పరామర్శించడం ఏంటని ప్రశ్నించారు. జగన్మోహన్‌రెడ్డికి పార్టీని నడిపే అర్హత లేదన్నారు. గత ప్రభుత్వంలో ఆర్థిక వ్యవస్థలన్నిటినీ నాశనం చేసి, హత్య రాజకీయాలు పెంచి పోషిస్తున్నారని, జగన్ తీరును ఖండిస్తున్నామని, ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ప్రధాని నరేంద్ర మోడీ సహకారంతో ఏపీ అభివృద్ధిలో దూసుకుపోతున్న దని, కులాల మధ్య చిచ్చుపెట్టి రాజకీయ పబ్బం గడుపుకోవాలనే నీచపు బుద్ధికి తొందరలోనే ప్రజలు తగిన బుద్ధి చెబుతారన్నారు. తిరుపతిలో పార్టీ నాయకుల ఇళ్లపై దాడులు చేసిన సంఘటనలు ఎన్నడూ లేవని, టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి జేబి శ్రీనివాస్ ఇంటిపై జరిగిన దాడిని ఖండిస్తున్నామని నరసింహ యాదవ్ ఉన్నారు. టిడిపి ఆవిర్భావం నుంచి ఎన్టీఆర్, చంద్రబాబు నాయుడు వరకు ఎన్నడూ కుల రాజకీయాలు చేయలేదని, రాజకీయ ఉద్దేశపు కేసులు ఎన్నడూ పెట్టలేదని పేర్కొన్నారు. తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, జిల్లా అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నటువంటి కలెక్టర్ పైన భూమన కరుణాకర్ రెడ్డి బ్లాక్ మెయిల్ రాజకీయాలు చేస్తున్నారని, బీసీ కులానికి చెందిన వ్యక్తి పై అహంకారపుతో కూడిన వ్యాఖ్యలు చేయడం మానుకోవాలని, తిరుపతిలో దాదాపు 92 వేల దొంగ ఓట్లను తొలగిస్తే కలెక్టర్ పైన విమర్శలు చేస్తూ మాట్లాడిన భాషను యావత్ బీసీ కులాలన్నీ ఖండిస్తున్నాయి అన్నారు. తిరుపతిలో గతంలో ఏ ఎన్నిక సక్రమంగా జరిగిన దాఖలాలు లేవని ఆరోపించారు. కులాల మధ్య చిచ్చు పెట్టి ఇంకా ఎన్నేళ్లు రాజకీయాలు చేస్తారని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో గంగమ్మ గుడి చైర్మన్ మహేష్ యాదవ్, జిల్లా యాదవ సంఘం అధ్యక్షులు ఈతమాకుల హేమంత్ యాదవ్, తిరుపతి యాదవ సంఘం అధ్యక్షులు కట్టా జయరామ్ యాదవ్, గంగమ్మ గుడి మాజి చైర్మన్ భరణి యాదవ్, రవిశంకర్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీకాళహస్తీశ్వరాలయంలో...

# ఇక వివిపిల దర్శనాలకు శ్లాట్స్

-రాహుకేతు పూజలు చేయించుకునే భక్తులకు కూల్ కూల్
-సామాన్య భక్తులకు ఎల్ఇడి టీవిల సదుపాయం
-ధర్మకర్తల మండలి సమావేశంలో నిర్ణయాలు

శ్రీకాళహస్తి, ఆగస్టు 14 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి సర్వసభ్య సమావేశం శుక్రవారం చైర్మెన్ కొట్టెసాయి ప్రసాద్ అధ్యక్షతన జరిగి సుమారు 50 అంశాలకు ఆమోదం తెలిపారు. ఈ సమావేశంలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఇఓ బికె వెంకటేశు, ఇఇ శ్రీనివాసులు రాజు, ప్రధానార్చకులు సంబంధం గురుకుల్ సమాధానం చెప్పారు. ఈ సమావేశంలో పలు కీలక అంశాలను చర్చించినట్లు సమాచారం. రాహుకేతుదోష నివారణ పూజలు జరిపించుకునే సామాన్యభక్తులకుమరో ంరెండు మండపాలు రూ.500ల పూజలు జరుపుకునే భక్తుల మండపంలో ఎసిలు ఏర్పాటు ఎల్ఇడి టివిల ఏర్పాటు ఉచిత దర్శనం, రూ50ల దర్శనం క్యూలలో



శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి సమావేశం

కూర్చునేందుకు సీటింగ్ అన్నదాన భవనంపై మరో షెడ్లు వేసి పథకం విస్తృత పరచటం అంశాలకు ఆమోదం తెలిపారు. కాగా స్వర్ణముఖి ఆనకట్టల సుందరీకణ, ప్రతి ప్రవేశం ద్వారం వద్ద ఆర్చిలు నిర్మించాలి. అలాగే సన్నిధివీధిలోని రామాలయం, టూరిస్టుబస్టాండుల వద్ద కొత్త టాయిలెట్స్ నిర్మాణం, గంగాసదన్ అతిధి గృహం షెడ్‌కు పెయింటింగ్ పనులకు బోర్డు ఆమోదం తెలిపింది. లోబాలిలో దేవస్థానం సిబ్బందికి క్వార్టర్స్ నిర్మాణానికి ప్రతిపాదన మూడో గేట్ నుంచి వర్షపు నీటిని నదిలోకి తరలించుటకు ఆర్‌సిసి డ్రైయిన్ నిర్మాణం దేవస్థానం ఎలక్ట్రికల్ విభాగంలో మరో 15 మంది నియామకానికి ఆమోదం చేసినట్లు ప్రకటించారు. భక్తుల కోసం 5 కొత్త సేవలను ప్రతిపాదించినట్లు బోర్డు సమావేశం అనంతరం శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి ప్రకటించారు. దాతల విరాళాల స్థాయిని బట్టి ప్రత్యేక సదుపాయాలు కల్పించేందుకు నిర్ణయం. ప్రస్తుతం దేవస్థానంలో 125కెవి జనరేటర్‌తో నడుస్తుంది దాని స్థానంలో కొత్తగా 250 కెవి జనరేటర్ ఏర్పాటుకు తీర్మానించారు. నాలుగు మాడావీధుల్లో ఏర్పాటు చేసిన ఎల్ఇడి లైట్లు స్థానంలో కొత్త లైట్లు ఏర్పాటుకాగా ఇటీవల నిర్వహించిన అన్ని టటెండర్లకు బోర్డు ఆమోదం తెలిపింది.

**ఇక తిరుమల తరహాలు దర్శనాలు:**
శ్రీకాళహస్తీశ్వరాలయంలో కూడా తిరుమల తరహాలో వివిపిల దర్శనాలకు సమయం కేటాయిస్తున్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నం 1 గంట లోపల రెండు స్లాట్స్, అలాగే మధ్యాహ్నం నుంచి రెండు స్లాట్స్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు సమావేశం తీర్మానాల గురించి ఎంఎల్ఏ సుధీర్‌రెడ్డి వివరించారు.




## ఆక్రమణలపై కఠిన చర్యలు తీసుకోవాలి

**-వెలగచర్ల భూ ఆక్రమణలపై పిర్యాదు**



**పెనగలూరు,ఆగస్టు 14 ప్రభాతవార్త :** పెనగలూరు మండలం వెలగచర్ల రెవెన్యూ విలేజ్లోని ప్రభుత్వ భూమి సర్వే నెంబర్ 865లో అక్రమంగా అనుమతి లేకుండా అక్రమార్కులు మామిడి చెట్లు నాటుకుని సాగు చేసుకుంటున్న ఆక్రమణలపై కఠిన చర్యలు తీసుకోవాలని హరికృష్ణ రీ-సర్వే డిప్యూటీ తహశీల్దార్కి శుక్రవారం ఫిర్యాదు చేశారు. వీఎంపురం రెవెన్యూ విలేజ్లోని సర్వే నెంబర్లు 552, 732లు అటవీశాఖ భూములను తప్పుడు మార్గంలో ఆన్లైన్ చేసుకున్నారని అర్జీలో ఆరోపించారు. ఈ భూములు పూర్తిగా నేటికీ అటవీ శాఖ వారి అధీనం లోనే ఉన్నాయన్నారు. ఈ భూములలో ఎటువంటి సాగు లేనప్పటికీ తప్పుడు మార్గంలో బ్యాంకు రుణాలు తీసుకున్నారని పేర్కొన్నారు. డ్రిప్ ఇరిగేషన్ ద్వారా సాగులో లేని ఈ భూములపై ప్రభుత్వాన్ని మోసం చేసి డ్రిప్ పైపులు తెచ్చుకుని ప్రైవేటు వ్యక్తులకు అమ్ముకున్నారని ఆరోపించారు. భూ అక్రమాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా అర్జీ దారుడుకోరారు. ఈ విషయంపై డీటీ సుమని మాట్లాడుతూ తహశీల్దార్ దృష్టికి తీసుకు వెళ్తానని చెప్పారు.

## ప్రజా సమస్యలకు పరిష్కార వేదికే... ప్రజాదర్బార్ : ముక్కా



**రైల్వేకోడూరు రూరల్,ఆగస్టు 14 ప్రభాతవార్త :** ప్రజా సమస్యల పట్ల పరిష్కార వేదికగా రైల్వేకోడూరు ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహిస్తున్నట్లు రైల్వేకోడూరు టిడిపి ఇన్చార్జ్ ముక్కా రూపనందరెడ్డి అన్నారు. శుక్రవారం రైల్వేకోడూరు మండలంలోని రాఘవరాజాపురం గ్రామం నందు ఉన్న టిడిపి కార్యాలయంలో ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రూపనందరెడ్డి మాట్లాడుతూ రైల్వే కోడూరు నియోజకవర్గంలోని ఐదు మండలాలకు సంబంధించిన ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. ఇప్పటికే చాలా ప్రజా సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించినట్లు వారు తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ల నేతృతంలో ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని వారు తెలిపారు. గ్రామీణ ప్రాంతాలలో మౌలిక వసతులు, పెన్షన్లు తదితర అంశాలపై ప్రజా సమస్యలు వస్తున్నాయని సంబంధిత అధికారులకు ఫోన్ల ద్వారా సమస్యను అందజేసి పరిష్కారానికి శ్రీకారం చుట్టాలని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మాజీ మండల అధ్యక్షులు పందేటి వెంకటరామరాజు, జనార్దన్ రాజు, తిరుపతి శేఖర్, సుబ్బరామరెడ్డి, కొప్పరపు నరసింహులు, భుజంగేశ్వర స్వామి దేవాలయం చైర్మన్ ఉంగరాల సురేంద్ర కుమార్, కోనేటి రాజు కండ్రిక కాంట్రాక్టర్ చంద్రరాజు, చలపతి తో పాటు నియోజకవర్గానికి చెందిన ముఖ్యులు పాల్గొన్నారు.

## మొక్కలు నాటడమే కాదు...

**వాటి సంరక్షణ మనదే బాధ్యత**



**చిట్వేలి, ఆగస్టు 14 ప్రభాతవార్త:** పర్యావరణాన్ని రక్షించి, జీవుల మనగడకు అవసరమైన ప్రాణవాయువును అందించే మొక్కలను నాటడమే కాదు వాటిని సంరక్షించి భావితరాలకు అందించవలసిన బాధ్యత మన అందరిపై ఉన్నదని రైల్వే కోడూరు రూరల్ సీఐ శ్రీనివాసులు, స్థానిక ఎస్సై వినోద్ కుమార్ అన్నారు. శుక్రవారం జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు, రేణిగుంట డివిజన్ డిఎస్పి శ్రీనివాసరావు ఆదేశాలతో స్థానిక ఉన్నత పాఠశాలలో హెచ్ఎం దుర్గరాజు, ఎన్సిసి అధికారి రాజశేఖర్, ఉపాధ్యాయులు, పిల్లలతో కలిసి పెద్ద ఎత్తున మొక్కలను నాటారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ అనేది ప్రభుత్వ శాఖల బాధ్యత మాత్రమే కాదని, ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత అని గుర్తు చేశారు. ఒక మొక్క నాటడం ద్వారా మన చుట్టూ పచ్చదనం పెరగడంతో పాటు భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన గాలి, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించగలమని అన్నారు. మొక్క నాటిన తర్వాత దాని సంరక్షణకు కూడా బాధ్యత తీసుకోవాలని, విద్యార్థులు తమ ఇళ్లలో, పాఠశాలల్లో మరియు పరిసర ప్రాంతాల్లో మొక్కలను నాటి వాటిని సంరక్షించేలా కుటుంబ సభ్యులు, స్నేహితులు ప్రోత్సహించాలని సూచించారు."ఒక్కొక్కరు ఒక్క మొక్క నాటితే.. ఊరంతా పచ్చగా మారుతుంది" అన్న సత్యాన్ని గుర్తు చేశారు. ప్రతి విద్యార్థి "నా మొక్క- నా బాధ్యత" అనే స్ఫూర్తితో ముందుకు సాగాలని, పచ్చదనం పెంపొందించడంలో చురుకైన భాగస్వాములుగా నిలవాలని పోలీసు అధికారులు పిలుపునిచ్చారు. కావాల్సిన మేర మొక్కలను అటవీశాఖ అధికారులు అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐ వెంగయ్య, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## విద్యార్థినీలు పట్ల నిర్లక్ష్యం తగదు: ముక్కా వరలక్ష్మి



**రైల్వేకోడూరు రూరల్, ఆగస్టు 14 ప్రభాతవార్త :** ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థినిలు పట్ల సంబంధిత ఉపాధ్యాయులు మరియు సిబ్బంది అలసత్వం ప్రదర్శిస్తే కఠిన చర్యలు ఉంటాయని రైల్వేకోడూరు టిడిపి ఇన్చార్జ్ ముక్కా రూపనందరెడ్డి సతీమణి వరలక్ష్మి అన్నారు. శుక్రవారం కోడూరు మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థినిలు వసతులను ఆమె క్షుణ్ణంగా పరిశీలించి మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కొంతమంది విద్యార్థినిలు సమస్యల పట్ల స్పందించి న్యాయం చేయాలని ఆమె దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మరుగుదొడ్లు, పరిసరాల పరిశుభ్రత పాటించాలని లేనిపక్షంలో సంబంధిత సిబ్బందికి శాఖపరమైన చర్యలు ఉంటాయని ఆమె అన్నారు. ప్రభుత్వ పాఠశాలలకు వచ్చే విద్యార్థినిలు పూర్తిస్థాయిలో నిరుపేద విద్యార్థినిలు అని వారి పట్ల వరలక్ష్మి చేస్తే కఠినంగా వ్యవహ రిస్తామని వారు అన్నారు. ముఖ్యంగా మధ్యాహ్నం భోజనాన్ని పరిశుభ్రంగా చేసి విద్యార్థినులకు అందజే యాలని వారు అన్నారు. ఇకమీదట ఏవైనా పాఠశాల గురించి సమస్యలు వస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మరియు విద్యార్థినిలు తోపాటు డీసీఎంఎస్ చైర్మన్ ఎర్రగుండ్ల జయప్రకాష్, క్లస్టర్ ఇంచార్జ్ మోలా, శివారెడ్డి, శేఖర్ రాజు, సుదర్శన్ రాజు, పట్టణ అధ్యక్షులు పోకలమని, కోడూరు ఎస్సై లక్ష్మీ ప్రసాద్ రెడ్డి, తిప్పన రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ స్ఫూర్తిని చాటిన ఎస్జీఎస్ విద్యార్థులు

**తిరుపతి విద్య ఆగష్టు 14 ప్రభాత వార్త**




స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని ఎస్జీఎస్ ఆర్ట్స్ కళాశాలలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. దేశభక్తి, జాతీయ సమైక్యత, సామాజిక బాధ్యతాభావాన్ని విద్యార్థుల్లో పెంపొందించే లక్ష్యంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సుమారు వెయ్యి మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని జాతీయ స్ఫూర్తిని చాటారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. బి. సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యా సంస్థల్లో నిర్వహిస్తున్న ఆనే నేను ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు ఉత్సాహంగా ప్రతిజ్ఞ చేశారు. దేశ ఐక్యత, సమగ్రత, అభివృద్ధికి తమ వంతు బాధ్యతను నిర్వర్తిస్తామని ప్రతిజ్ఞ చేశారు. అనంతరం కళాశాల ప్రాంగణం నుంచి లక్ష్మీపురం సర్కిల్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. జాతీయ జెండాలను చేతబూనిన విద్యార్థులు దేశభక్తి నినాదాలు చేస్తూ ర్యాలీలో పాల్గొన్నారు. జాతీయ సమైక్యత, దేశభక్తి, సామాజిక బాధ్యతను ప్రతిబింబించేలా విద్యార్థులు చేసిన నినాదాలతో ర్యాలీ మార్గం సందడిగా మారింది. విద్యార్థుల క్రమశిక్షణ, ఉత్సాహం ప్రత్యేకంగా ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డా. బి. సత్యనారాయణ మాట్లాడుతూ విద్యార్థుల్లో చిన్ననాటి నుంచే దేశభక్తి, జాతీయ సమైక్యత, బాధ్యతాభావాన్ని పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. దేశ ఐక్యత, సమగ్రతను కాపాడటంలో యువత కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. దేశాభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డా. ఎం. మాదన్న, ఎన్సీసీ అధికారులు పి. ఉదయ్, పి. హరీష్రెడ్డి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్లు బి. సులోచన రాణి, డా. డి. సుధాకర్, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డా. ఎం. రామనాథం, ఫిజికల్ డైరెక్టర్ పి. కుమార్తో పాటు పలువురు అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ర్యాలీ విద్యార్థుల్లో దేశభక్తి

## ముఖ్య మంత్రి సహాయ నిధి పేదలకు వరం

**-ఎమ్మెల్యే శ్రీధర్, ముక్కా సాయివికాస్రెడ్డి**



**పెనగలూరు,ఆగస్టు 14 ప్రభాతవార్త:** తిరుపతి జిల్లా రైల్వేకోడూరు నియోజకవర్గం పెనగలూరు మండలంలో ముఖ్యమంత్రి సహాయ నిధి పేద ప్రజలకు ఓ వరం లాంటిదని రైల్వే కోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్, టీడీపీ యువ నాయకుడు ముక్కా సాయివికాస్ రెడ్డి తెలిపారు. శుక్రవారం పెనగలూరు మండలంలోని పలువురు లబ్ధిదారుల ఇళ్లకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల అందించారు. జెట్టివారిపల్లికి చెందిన చిన్నరెడ్డి జితిన్ కుమార్రెడ్డికి రూ. 57,884, ఇండ్లూరు దళితవాడకు చెందిన రత్నకుమార్ రూ.48,376, సాతుపల్లి గ్రామానికి చెందిన భాగ్యమ్మకు రూ 44,933, కమలమ్మకు రూ. 35,541, పీ కొత్తపల్లికి చెందిన నాగేంద్రకు రూ.61,327, యాపాటివారిపల్లికి చెందిన విజయ నాయుడు కు రూ. 62,430, ఈటిమార్పూరం కు చెంది నారాయణమ్మకు రూ. 20, 502, తూర్పుపల్లికి చెందిన పోలి చిన్నవెంకటరెడ్డికి రూ. 45,933, భాగ్యమ్మ కు రూ. 36 వేలు, వెంకట నారాయణపల్లికి చెందిన సుబ్బమ్మ కు రూ. 70 వేల రూపాయల చెక్కులకు వారి ఇంటికి వెళ్ళి అందించారు. ఈ కార్యక్రమంలో బి ఎల్ నరసింహా రెడ్డి, మాజీ మండల అధ్యక్షుడు, ఎక్స్ ఎంపిటీసీ కొత్త బాలకృష్ణ, గుత్తి నరసింహా, మాడపూరి శ్రీనివాసులు, దాసరి దామోదర్ నాయుడు, చక్రంపేట సురేష్ రెడ్డి, జనసేన నాయకుడు గొబ్బూరు హరి, కంబాల కుంట మధన్, మనోజ్ రెడ్డి, వెంకటేష్ నాయుడు, సుదర్శన్, నారాయణ నెల్లూరు సాయి, రెడ్డివారిపల్లి హరి, ఉగ్ర నరసింహా, గంధంశెట్టి రామయ్య, తలుపోళ్ళ నరసయ్య , తూర్పుపల్లి వెంకటయ్య, ఈటీమార్పూరం రాజు, మహేంద్ర, ఓబిలి అమీరుల్లా పాల్గొన్నారు.

## అవయవదానం ప్రాణదానం... ఒక్కదాత ఏడుగురికి జీవనదాత



**రేణిగుంట, ఆగస్టు 14 ప్రభాతవార్త:** అవయవదానంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని జన విజ్ఞాన వేదిక ప్రతినిధులు పిలుపునిచ్చారు. ప్రపంచ అవయవ దాన దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం రేణిగుంట బాలికల, బాలుర ప్లస్ ఉన్నత పాఠశాలల్లో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఓ. వెంకటరమణ మాట్లాడుతూ అవయవదానం ప్రాణదానం. జీవనదానం అని పేర్కొన్నారు. ఒక అవయవదాత తన అవయవాల ద్వారా ఏడుగురి వరకు ప్రాణాలను కాపాడే అవకాశం ఉందన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ అవయవదాతగా నమోదు చేసుకోవచ్చని తెలిపారు. కిడ్నీ, గుండె, ఊపిరితిత్తులు, కాలేయం, క్లోమం, చిన్నపేగు, చర్మం, కళ్లను దానం చేయవచ్చని వివరించారు. మనిషి మరణించిన తర్వాత కూడా తన అవయవాల ద్వారా మరికొందరికి కొత్త జీవితాన్ని అందించే అవకాశం ఉందన్నారు. అవయవదానంపై కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు, విద్యార్థుల్లో అవగాహన కల్పించి మరింత మందిని అవయవదాతలుగా నమోదు చేయించాలని కోరారు. అనంతరం ఆగస్టు 11న కన్నుమూసిన ప్రముఖ ప్రజా శాస్త్రవేత్త ప్రొఫెసర్ ఎం.పి. పరమేశ్వరన్కు ఘనంగా నివాళులర్పించారు. అణు శాస్త్రవేత్తగా పనిచేసిన ఆయన ఉద్యోగాన్ని వదిలి ప్రజల్లో శాస్త్రీయ అవగాహన పెంపొందించేందుకు జీవితాంతం కృషి చేశారని వక్తలు కొనియాడారు. అక్షరాస్యత, మహిళా సాధికారతతో పాటు శాస్త్ర విజ్ఞానాన్ని ప్రజలకు చేరువ చేయడంలో పరమేశ్వరన్ కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతిఒక్కరూకృషిచేయాలనిపిలుపునిచ్చారు. కార్యక్రమంలోశ్యామల, ఇమామ్ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

## మంచినీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టండి.!

**-ఎంపిపి ఏ.వి.బ్రహ్మానంద రెడ్డి**

**రామచంద్రాపురం, ఆగస్టు 14 ప్రభాతవార్త:** గ్రామాలలో మంచినీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఎంపిపి ఏ.వి.బ్రహ్మానంద రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో సాధారణ సర్వ సభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అధికారులు తమ శాఖల ప్రగతి నివేధికలను సభకు చదివి వినిపించారు. అనంతరం ఎంపిపి మాట్లాడుతూ అనుప్పల్లి పంచాయతీలో మంచినీటి ఎద్దడి తీవ్రంగా వుందని, నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఏఈ పవన్రాజ్కు సూచించారు. పారిశుధ్య నిర్వహణ, విబిజి రామ్జి పనుల్లో పర్యవేక్షణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. సోలార్ విద్యుత్పై విస్తృత ప్రచారం అవసరమని ఏఈ గిరిబాబు అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ పులి రామ్సింగ్, తహశీల్ధార్ మధుసూదన్ రావు, ఎంపిటిసిలు మంజుల సిద్దారెడ్డి, కృష్ణవేణమ్మ, జ్ఞానమ్మ, కవిత, మునీంద్ర యాదవ్, వివిధ శాఖ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## సమగ్ర ఓటరు సర్వేకి సహకరించండి!

**రామచంద్రాపురం, ఆగస్టు 14 ప్రభాతవార్త:** సమగ్ర ఓటరు సర్వేకి ప్రజలు సహకరించాలని తహశీల్దార్ మధుసూదన్ రావు కోరారు. శుక్రవారం రెవెన్యూ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని 33 పోలింగ్ స్టేషన్ల పరిధిలో 24,009 మంది ఓటర్లు వున్నట్లు తెలిపారు. నో మ్యాపింగ్ 1386 మంది, పేర్లు, ఇంటిపేర్లు, ఇతరత్రా సవరణలకు 4225 మంది ఓటర్లకు నోటీసులు అందజేసినట్లు తెలిపారు. మూడు డివిజన్లలో ఈ నెల 17 నుండి సెప్టెంబర్ 21 వరకు విచారణ చేపడతామన్నారు. ఓటర్లను విచారణ చేసి తిరిగి పునరుద్ధరించనున్నట్లు తెలిపారు. డివిజన్ పరిధిలో ఎంపిడిఓ పులి రామ్ సింగ్, స్వర్ణ గ్రామ వార్డు అధికారిణి తేజోవతి అందుబాటులో వుంటారని అన్నారు.

## జాతర వేళ మద్యం దుకాణాలు మూసివేయాలి: ఐద్వా



**రేణిగుంట, ఆగస్టు 14 ప్రభాతవార్త:** శ్రీ గంగమ్మ జాతరను పురస్కరించుకుని రేణిగుంట పట్టణంలోని మద్యం దుకాణాలను తక్షణమే మూసివేయాలని అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) జిల్లా అధ్యక్షురాలు కొండ్రెడ్డి ఈశ్వరమ్మ డిమాండ్ చేశారు. నూతనంగా ఏర్పాటు చేసిన మద్యం దుకాణాలను పట్టణం వెలుపలకు తరలించాలని కోరుతూ ఐద్వా, రేణిగుంట మద్యం వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యంలో పాంచాలినగర్లో స్థానిక మహిళలు చేపట్టిన వీధి నిరసనలు గురువారం ఏడో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా కొండ్రెడ్డి ఈశ్వరమ్మ మాట్లాడుతూ.. శాంతియుతంగా మహిళలు వారం రోజులుగా నిరసనలు చేపడుతున్నప్పటికీ సంబంధిత ఎక్సైజ్ అధికారులు స్పందించకపోవడం దుర్మార్గమన్నారు. శ్రీకాళహస్తి ఎమ్మెల్యే మద్యం దుకాణాలను పట్టణం వెలుపలకు తరలిస్తామని మహిళా సంఘానికి హామీ ఇచ్చే వరకు తమ పోరాటాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. మహిళల సహనాన్ని పరీక్షిస్తే ఆమరణ నిరాహార దీక్షకు దిగాల్సి వస్తుందని హెచ్చరించారు. రేణిగుంటలో ఏర్పాటు చేసిన రెండు మద్యం దుకాణాలు పాఠశాలలు, ఆలయాలు, జనావాసాలు, బస్టాపుల సమీపంలో ఉండటంతో ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్నాయని ఆమె ఆరోపించారు. ఈ నెల 17, 18, 19 తేదీల్లో శ్రీ గంగమ్మ జాతర జరగనున్న నేపథ్యంలో ఆలయానికి వచ్చే భక్తుల మనోభావాలను దృష్టిలో ఉంచుకుని జాతర సమయంలో మద్యం దుకాణాలను మూసివేయాలని కోరారు. నిరసనలకు గిరిజన సంఘం నాయకుడు మునిస్వామి మద్దతు తెలిపారు. ఐద్వా జిల్లా అధ్యక్షురాలు కొండ్రెడ్డి ఈశ్వరమ్మ, మండల అధ్యక్షురాలు భారతి, పద్మమ్మ, రేణిగుంట మద్యం వ్యతిరేక పోరాట కమిటీ కార్యదర్శి పద్మావతి, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

## దేశభక్తి నినాదాలతో శ్రీచైతన్య విద్యార్థుల ర్యాలీ



**తిరుపతి విద్య ఆగష్టు 14 ప్రభాత వార్త** స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని తిరుపతిలోని శ్రీచైతన్య పాఠశాల టీఎస్ఎన్ పురం శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులు ఘనంగా దేశభక్తి ర్యాలీ నిర్వహించారు. సుమారు 200 మంది విద్యార్థులు జాతీయ జెండాలను చేతబూని ర్యాలీలో ఉత్సాహంగా పాల్గొని దేశభక్తిని చాటారు. విద్యార్థుల క్రమశిక్షణ, ఉత్సాహం ర్యాలీకి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మేరా భారత్-శ్రేష్ఠ భారత్ తదితర దేశభక్తి నినాదాలతో ర్యాలీ హోరెత్తింది. విద్యార్థుల నినాదాలు, జాతీయ జెండాలతో పాఠశాల పరిసరాలు సందడిగా మారాయి. జాతీయ జెండాలను చేతబూని విద్యార్థులు క్రమశిక్షణతో ముందుకు సాగుతూ స్వాతంత్ర్య స్ఫూర్తిని చాటారు. దేశభక్తి గీతాలు, నినాదాలతో పరిసర ప్రాంతాల్లో జాతీయ స్ఫూర్తి వెల్లివిరిసింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ లక్ష్మీ ప్రసన్న మాట్లాడుతూ విద్యార్థుల్లో చిన్ననాటి నుంచే దేశభక్తి భావనను పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. దేశ స్వాతంత్రం కోసం పోరాడిన మహనీయుల త్యాగాలను విద్యార్థులకు తెలియజేయడంతో పాటు, దేశం పట్ల బాధ్యత, జాతీయ సమైక్యతా భావాలను పెంపొందించడమే ఈ కార్యక్రమం ఉద్దేశమని తెలిపారు. విద్యార్థులు చదువుతో పాటు దేశం పట్ల బాధ్యత కలిగిన పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఏజీఎం డా. సురేష్, ఆర్ఐ సురేష్ మాట్లాడుతూ విద్యార్థుల్లో దేశభక్తి, జాతీయ సమైక్యతా భావాలను పెంపొందించేలా ర్యాలీ నిర్వహించిన పాఠశాల యాజమాన్యం, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులను అభినందించారు. స్వాతంత్ర్య దినోత్సవం వంటి జాతీయ పర్వదినాల సందర్భంగా ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా విద్యార్థుల్లో దేశం పట్ల గౌరవం, బాధ్యత మరింత పెరుగుతాయని పేర్కొన్నారు. ర్యాలీలో విద్యార్థులు జై హింద్, వందే మాతరం నినాదాలతో ఉత్సాహంగా పాల్గొన్నారు. జాతీయ జెండాలను చేతబూని సాగిన విద్యార్థుల ర్యాలీ స్థానికులను ఆకట్టుకుంది. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ నిర్వహించిన ఈ కార్యక్రమం విద్యార్థుల్లో దేశభక్తి, జాతీయ సమైక్యతా స్ఫూర్తిని మరింత పెంపొందించింది.

# తిరుపతి డివిజన్

## ఈ నెల 16న వృద్ధ దంపతులకు కనకాభిషేకం




**తిరుపతి హెల్త్, ఆగస్టు 14 ప్రభాతవార్త:** ఈనెల 16న ఆదివారం పద్మావతి కళ్యాణ మండపం బ్లాక్ నెంబర్ 3 నందు శ్రీ వాసవి ఆర్యవైశ్య వృద్ధ దంపతుల 16వ సామూహిక కనకాభిషేక మహోత్సవం ఘనంగా నిర్వహిస్తున్నట్లు శ్రీ వాసవి ఆర్యవైశ్య సేవా సమాజం అధ్యక్షులు దిండుకుర్తి నరసింహులు తెలియజేశారు. శుక్రవారం తిరుపతి ప్రెస్ క్లబ్లో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గత 16 సంవత్సరాలుగా ఆర్యవైశ్య వృద్ధ దంపతులకు ముకాభిషేక మహోత్సవం క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ మహోత్సవంలో ఏడు రాష్ట్రాల నుండే కాకుండా, దేశ, విదేశాల నుండి కూడా, ఆర్యవైశ్యులు పాల్గొంటున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి టీటీడీ పాలక మండలి సభ్యులు భాను ప్రకాష్ రెడ్డి అతిథిగా వస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఆర్య వైశ్యులంతా విచ్చేసి జయప్రదం చేయవలసినదిగా కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీ వాసవి ఆర్యవైశ్య సేవా సమాజం కార్యదర్శి పామిడి రామమూర్తి, నామా రాజేష్, సుకుమార్, నాగరాజు, చెన్నకేశవులు, ఆర్ మహేష్, నారాయణ, టిఎం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతిభా పురస్కారాలు అందుకోనున్న శ్రీసిటీ సిబ్బంది వీరే




**సత్యవేడు, ఆగస్టు 14 ప్రభాతవార్త:** 80వ స్వాతంత్ర్య దినోత్సవ సంబరాల నేపథ్యంలో విధి నిర్వహణలో విశేష ప్రతిభకనబరచిన అనేక మందిశ్రీసిటీ సిబ్బందికి శనివారం రివార్డ్స్ అందించనున్నారు. ఆ వివరాలను మీడియాకు శ్రీసిటీ భద్రతా ప్రత్యేక అధికారి రమేష్కుమార్ తెలియజేశారు. తడ బస్టాండ్ సమీప వద్దగుండెపోటుతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న డైకిన్ ఉద్యోగిని హుటాహుటిన ఆస్పత్రికి చేర్చి మానవత్వం చాటుకున్న కె.కుమరేషన్ (కాంచీపురం) అనే వ్యక్తికి ప్రత్యేక రివార్డు అందించనున్నట్లు ఆయన వెల్లడించారు. విధి నిర్వహణలో ప్రతిభకనబరచిన ఏఎస్వోలు జి.రవి, శివశంకర్, మునిరత్నం, సి.మురళి ట్రాఫిక్ రజని కుమార్, ఉమెన్స్ సెక్యూరిటీ గార్డ్స్ తులసి, సెక్యూరిటీ గార్డ్కి జి.నాగరాజు, బి.జనార్ధన్, కె.మునివేలు, ఎస్.మునస్వామి, ట్రాఫిక్ తిరుపతి, డ్రైవర్లు మణికంఠ, శ్యామ్ కుమార్, అయ్యప్ప, యాక్షన్ సెక్యూరిటీ ఫోర్సు సెక్యూరిటీ ఫోర్సు సునీల్యాదవ్, ఎస్పీవో ఆర్.బాబు, ఆఫీస్ అసిస్టెంట్ ఎస్.రమేష్లకు ప్రతిభా పురస్కారాలను శ్రీసిటీ డీఎస్పీ బి.వి.శ్రీనివాసులు చేతుల మీదుగా అందజేయనున్నారు. ఓ అండ్ఎం డిపార్ట్మెంట్ నుంచి ఎస్.రాజ్, ఆర్.మహేష్కుమార్, హౌస్ కీపింగ్ నుంచి టి.జయమ్మ, పి.పద్మలకు ప్రత్యేక ప్రశంసా పత్రాలు అందజేస్తారు. ఫ్యాబ్రికేషన్ నుంచి అశోక్, శ్రీసిటీ నర్సరీనుంచి శ్రీనివాసులు, వాటర్లైన్ డిపార్ట్మెంట్ నుంచి శ్రీరాములు, ఫోటోగ్రాఫర్ వెంకట్,ఎలక్ట్రికల్ డిపార్ట్మెంట్ నుంచి వెంకటరత్నం, అత్యవసర సేవలు ముత్తుకు ప్రత్యేక పురస్కార ప్రశంసా పత్రాలు అందించనున్నట్లు సెక్యూరిటీ భద్రతాధికారి రమేష్ పేర్కొన్నారు.

## జాతరను ప్రశాంత వాతావరణంలో జరుపుకుందాం

**-అర్బన్ సీఐ జయచంద్ర**



**రేణిగుంట, ఆగస్టు 14 (ప్రభాతవార్త):** రేణిగుంట పట్టణంలో సోమవారం నుంచి శుక్రవారం వరకు జరగనున్న శ్రీ గంగమ్మ తల్లి జాతరను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని అర్బన్ సీఐ ఎస్.జయచంద్ర కోరారు. జాతర సందర్భంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా, ట్రాఫిక్కు అంతరాయం లేకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శుక్రవారం రేణిగుంట పోలీస్స్టేషన్లో పట్టణంలోని వ్యాపారులు, దుకాణ దారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ జాతరకు వేలాది మంది భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున ప్రజలు, వ్యాపారులు పోలీసు శాఖకు పూర్తిస్థాయిలో సహకరించాలని సూచించారు. రహదారులను ఆక్రమించకుండా, దుకాణాల ఎదుట వస్తువులను రోడ్డుపై ఉంచకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వాహనాలను నిర్దేశించిన పార్కింగ్ ప్రాంతాల్లోనే నిలిపి ఉంచాలని, ట్రాఫిక్ నియంత్రణలో పోలీసులకు సహకరించాలని కోరారు. ప్రజలందరూ సమన్వయంతో వ్యవహరించి గంగమ్మ తల్లి జాతరను విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించాలని సీఐ జయచంద్ర విజ్ఞప్తి చేశారు.

### రైల్వే స్టేషన్లో విస్తృత తనిఖీలు:

శ్రీ గంగమ్మ తల్లి జాతర, స్వాతంత్ర దినోత్సవ ముందస్తు భద్రతా చర్యల్లో భాగంగా రేణిగుంట అర్బన్ పోలీసులు రైల్వే పోలీసులతో కలిసి శుక్రవారం సాయంత్రం రేణిగుంట రైల్వే స్టేషన్లో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాల మేరకు, డీఎస్పీ శ్రీనివాసరావు సూచనలతో ఆయన స్వీయ పర్యవేక్షణలో అర్బన్ సీఐ జయచంద్ర నేతృత్వంలో రైల్వే స్టేషన్ లోని అన్ని ప్లాట్ఫామ్లు, పార్సిల్ కార్యాలయం, వెయిటింగ్ రూమ్లను పోలీసులు క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అనుమానాస్పదంగా సంచరిస్తున్న వ్యక్తులను విచారించి వివరాలు సేకరించారు. ప్లాట్ఫామ్లపై సంచరిస్తున్న బిచ్చగాళ్లను, టికెట్ లేని ప్రయాణికులను స్టేషన్ ప్రాంగణం నుంచి బయటకు పంపించారు. జాతర సందర్భంగా రైల్వే స్టేషన్కు వచ్చే భక్తులు, ప్రయాణికుల భద్రతకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

## యువతే దేశానికి బలం.. డ్రగ్స్కు దూరంగా ఉండాలి



**తిరుపతి విద్య ఆగష్టు 14 ప్రభాత వార్త** మాదక ద్రవ్యాల వ్యసనం యువత భవిష్యత్తును నాశనం చేయడమే కాకుండా దేశ ప్రగతికి కూడా అడ్డంకిగా మారుతుందని వక్తలు పేర్కొన్నారు. దేశ జనాభాలో అత్యధికంగా ఉన్న యువత ఆరోగ్యకరమైన, బాధ్యతాయుతమైన జీవన విధానాన్ని ఎంచుకున్నప్పుడే అభివృద్ధి చెందిన భారత్ లక్ష్యం సాకారం అవుతుందని అన్నారు. తిరుపతిలోని ఎమరాల్డ్స్ డిగ్రీ కళాశాలలో భారత ప్రభుత్వం యువజన సర్వీసులు, క్రీడల మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలోని మై భారత్ సంస్థ నిర్వహణలో జిల్లాస్థాయి నషాముక్త్ యువ ఫర్ వికసిత్ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాల ఉపసంచాలకులు మునిరత్నం, సెట్విన్ తిరుపతి మేనేజర్ మోహన్, మై భారత్ అకౌంట్స్ ఆఫీసర్ శ్రీనివాస్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వినియోగం ఒక వ్యక్తి జీవితానికే పరిమితం కాదని, దాని ప్రభావం కుటుంబం నుంచి సమాజం వరకు విస్తరిస్తుందని అన్నారు. యువత చెడు వ్యసనాలకు లోనైతే వారి ఆరోగ్యం, విద్య, ఉపాధి అవకాశాలు దెబ్బతినడంతో పాటు కుటుంబాలు ఆర్థికంగా, సామాజికంగా ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడుతుందని తెలిపారు. యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండటంతో పాటు తమ స్నేహితులు, పరిచయస్తుల్లోనూ అవగాహన కల్పించాలని సూచించారు. క్రీడలు, విద్య, నైపుణ్యాభివృద్ధి, సృజనాత్మక కార్యక్రమాల వైపు యువత దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. మాదక ద్రవ్యాల రహిత సమాజ నిర్మాణం ప్రతి ఒక్కరి బాధ్యతగా గుర్తించాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా నషాముక్త్ భారత్ - వికసిత్ భారత్ లక్ష్యానికి కట్టుబడి ఉంటామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం వివిధ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేసి అభినందించారు.

